కొనసాగిన గ్యాస్ ట్యాంకర్ల సమ్మె

చెన్నై, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ ట్యాంకర్ లారీల సమ్మె మూడో రోజుకు చేరింది. శనివారం ప్రముఖ చమురు సంస్థల వద్ద కాంట్రాక్టు పద్ధతిలో నడిచిన గ్యాస్ ట్యాంకర్ లారీల యజమానులు సమ్మెను తీవ్రతరం చేశారు. దీంతో రాష్ట్రంలోని పలు నగరాల్లో వంట గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సమ్మె కారణంగా గ్యాస్ ట్యాంకర్ల యజమానులకు రోజుకు రూ.2 కోట్ల చొప్పున మూడు రోజులకు రూ.6 కోట్ల దాకా నష్టం వాటిల్లిందని తెలిపారు. దీపావళి పండుగ సమీపిస్తుండటంతో ఈ సమ్మెను పరిష్కరించేందుకు చమురు సంస్థల నిర్వాహకులు చర్యలు చేపట్టాలని గ్యాస్ వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.



స్థానిక టి.నగర్ రంగనాథన్‌వీధిలో కొనుగోలుదారుల రద్దీ

దీపావళి షాపింగ్ ప్రారంభం

● 26వేల మంది రౌడీలపై నిఘా

ప్యారీస్, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి):దీపావళి పండుగను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా నూతన వస్త్రాలు, టపాసులు, పూజలకు అవసరమైన వస్తువుల కొనుగోళ్లు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. దీనితో మార్కెట్లు, షాపింగ్ మాల్స్, వీధుల్లో కొనుగోలుదారుల రద్దీ పెరిగింది. రద్దీలో మాజీ నేరస్తులు, రౌడీలు చేతివాటం ప్రదర్శించడాన్ని అడ్డుకునేందుకు రాష్ట్రపోలీస్‌శాఖ ఈ సారి పటిష్ఠ చర్యలు చేపట్టింది. డీజీపీ వెంకటరామన్, ఏడీజీపీ డేవిడ్ సన్ దేవాశీర్వాదం జారీచేసిన ఉత్తర్వుల మేరకు... చెన్నై సహా అన్ని నగరాల్లో భద్రతా ఏర్పాట్లను పటిష్ఠం చేశారు. ఏప్లస్, ఏ, బీ, సీ అని నాలుగు రకాల రౌడీల జాబితాను పరిశీలించిన పోలీస్‌శాఖ సుమారు 26వేల మంది కదలికలపై నిఘా పెంచింది. కోవై, తిరుచ్చి, సేలం, తిరునల్వేలి, మదురై తదితర ప్రాంతాల్లో నేరాలకు పాల్పడుతున్న వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ ఉత్తర్వుల మేరకు సుమారు 6వేల మందికి పైగా రౌడీలపై నిఘా సారించారు. దీపావళి పండుగ ముగిసేవరకు రాష్ట్రంలో నిఘా కొనసాగుతుందని, రద్దీలో దొంగల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ సూచించారు.



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సాయిపల్లవి

ఘనంగా కలైమామణి పురస్కారాల ప్రదానం

ప్యారీస్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక చేపాక్ కలైవానర్ అరంగంలో శనివారం సాయంత్రం జరిగిన వేడుకల్లో సీఎం స్టాలిన్ చేతుల మీదుగా రాష్ట్రప్రభుత్వం ఎంపిక చేసిన సినీ, రంగస్థల కళాకారులు ప్రతిష్ఠాత్మమైన కలైమామణి పురస్కారాలు అందుకున్నారు. వీరిలో ప్రముఖ సినీ నటి సాయిపల్లవి, నటులు ఎస్‌జే సూర్య, విక్రమ్ ప్రభు, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, దర్శకుడు లింగుస్వామి తదితరులున్నారు కాగా, ఎంఎస్.సుబ్బలక్ష్మి పురస్కారాన్ని ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు కేజే యేసుదాస్ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టాలిన్ మాట్లాడుతూ... అత్యుత్తమ కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేసి ప్రశంసించే అవకాశం తనకు దక్కడం ఆనందంగా ఉందన్నారు. 2021, 2022, 2023 సంవత్సరాలకు గాను రాష్ట్రప్రభుత్వ కలైమామణి పురస్కారాలకు ఎంపికైన కళాకారులలో ఆర్థికంగా వెనుకబడిన వారికి రూ.లక్ష ప్రోత్సాహక నగదుతో పాటు ప్రతినెలా రూ.3వేలు ఆర్థికసాయం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాకెట్ వేగంతో పోటీపడేలా ఒకేరోజు రెండుసార్లు బంగారం ధర పెరిగిందని, బంగారు పతకం కంటే కలైమామణి పురస్కారం కళాకారులకు సమాజంలో మరింత గుర్తింపు, గౌరవం చేకూర్చుతుందని సీఎం పేర్కొన్నారు.

3,400 వీధుల్లో కులాల పేర్లు తొలగింపు

ప్యారీస్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో 3,400 వీధుల్లో కులాల పేర్ల తొలగింపు పనులను నవంబర్ 19వ తేదీలోగా పూర్తి చేయనున్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. జనావాసాలు, వీధులు, రోడ్లకు సూచించిన కులం పేర్ల తొలగింపునకు మార్గదర్శకాలు రూపొందించాలని రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకోసం స్థానిక ప్రజల అభిప్రాయాలు,ఆయా ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితులు సమీక్షించి, హరిజన కాలనీ, ఆదిద్రావిడర్ కాలనీ తదితర పేర్లు కూడా మార్చాల్సి ఉంటుంది. ఇందుకోసం క్షేత్ర పరిస్థితి, వాస్తవాల ఆధారంగా బ్లాక్ డెవలప్మెంట్ అధికారులు జాబితా తయారుచేసి అసిస్టెంట్ డైరెక్టర్లకు సమర్పించాలి. ఈ జాబితాలను కార్పొరేషన్, మున్సిపాలిటీ కమిషనర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, జోనల్ డైరెక్టర్లు ధృవీకరించాలి.ఈ కోవలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నగరంలో కులాల పేర్లతో 3,400వీధుల్లో ఉన్న బోర్డుల తొలగింపు ప్రక్రియను ప్రారంభించిన సందర్భంగా మహేష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ... కులాల పేర్లను వచ్చే నవంబర్ 19వ తేదీలోపు 200 వార్డుల్లో తొలగించే పనులను 15జోన్ల చైర్మన్లకు అప్పగించినట్లు తెలిపారు. కొత్త పేర్లపై జీసీసీ సమావేశంలో తీర్మానం ఆమోదించి ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా ఎంపిక చేస్తామన్నారు. పాత బోర్డులు తొలగించి, వాటి స్థానంలో రాత్రిళ్లు మెరిసే 3డీ డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



జీసీసీ డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్

గుడిసెలు లేని రాష్ట్రం నా లక్ష్యం

● సీఎం స్టాలిన్

చెన్నై, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గుడిసెలు లేని రాష్ట్రంగా తమిళనాడును మార్చడమే తన ప్రధాన లక్ష్యమని, ఆ దిశగానే చర్యలు చేపడుతున్నానని సీఎం ఎంకే స్టాలిన్ అన్నారు. శనివారం ఉదయం రాష్ట్రవ్యాప్తంగా 12,480 గ్రామసభలు జరిగాయి. వీటిలో 10 వేల గ్రామసభలను ఉద్దేశించి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. డీఎంకే వ్యవస్థాపకుడు, దివంగత అన్నాదురై పార్టీ నాయకులను, కార్యకర్తలకు ప్రజలవద్దకు వెళ్లండి... వారి సమస్యలను అడిగి తెలుసుకోండి... అంటూ పురమాయించేవారన్నారు. ఆ తరహాలోనే తాను అధికార వర్గాన్నంతా ఈ భారీ గ్రామసభలపై ప్రత్యేక దృష్టి సారించి, ఆయా సభల్లో తీర్మానాలను పరిశీలించి అప్పటికప్పుడే చర్యలు చేపట్టమని ఉత్తర్వులిచ్చానని చెప్పారు. దేశానికి వెన్నెములాంటి గ్రామాలు సుభిక్షంగా ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామసభల ద్వారానే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని తమ ప్రభుత్వం గుర్తించిందని, ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వందల సంఖ్యలో జరిగిన గ్రామసభలలో పాల్గొన్నానని చెప్పారు. ఇక అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రిగా వారి సమస్యలను వరుసగా పరిష్కరిస్తూ వచ్చానని, ఆ సమయంలో మహిళలు ఆర్థికంగా ముందుకు వెళ్లలేకపోతున్నారని గమనించానన్నారు. ఆ సమయంలో తనకు తోచిన తలంపులే వెలుగుబాట పయనం (సిటీ, టౌన్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం), మహిళలకు ప్రతినెలా రూ.1000 చెల్లించే కలైంజర్ సాధికారిక నగదు పంపిణీ పథకాలుగా రూపుదిద్దుకున్నాయన్నారు. ఈ రెండు పథకాల వల్ల మహిళలకు ప్రతినెలా రూ.3500 ఆదా అవుతున్నట్లు ప్రభుత్వ గణంకాలు రుజువు చేస్తున్నాయని చెప్పారు. సర్పంచ్‌లు, అధికారులు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకూడదని, యేటా జమా పద్దుల లెక్కలను సక్రమంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొనే తాగునీటి సమస్య అని, డబ్బును నీళ్లలా ఖర్చుపెడుతున్నారనే తమిళనాడి ఉందని, ప్రస్తుతం నీళ్లను డబ్బులా పొదుపుగా వాడాల్సిన అవసరాలు ఏర్పడుతున్నాయని ఆయన చెప్పారు. గ్రామీణ ప్రజలందరికీ తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు.



గ్రామసభలనుద్దేశించి ప్రసంగిస్తున్న స్టాలిన్



బ్యాడ్మింటన్ గ్రౌండ్‌కు మంత్రి శేఖర్‌బాబు ఆధ్వర్యంలో శంకుస్థాపన

ఆ 1500 మందిని పర్మినెంట్ చేస్తాం

● మంత్రి శేఖర్‌బాబు

చెన్నై, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సుప్రసిద్ధ ఆలయాల్లో ఐదేళ్లకు పైగా పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను వచ్చే యేడాది ఫిబ్రవరిలోగా పర్మనెంట్ చేస్తామని ఆ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రకటించారు. ప్యారీస్ కార్నర్ రాజా అన్నామలై మండ్రంలో శనివారం ఉదయం రాష్ట్ర ఆలయాల ఉద్యోగుల సంఘం మహానాడు జరిగింది. ఈ మహానాడును ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నాలుగున్నర సంవత్సరాల డీఎంకే ద్రావిడ తరహా పాలన ఆధ్యాత్మికులకు వ్యతిరేకమైన పాలన కాదని రాష్ట్ర ప్రజలు గుర్తించారన్నారు. ఎన్నో యేళ్లుగా కుంభాభిషేకాలకు కూడా నోచుకోని ఆలయాలకు కుంభాభిషేకాలు నిర్వహించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా 3,707 ఆలయాలకు కుంభాభిషేకాలు జరిపామని, రూ.8వేల కోట్ల ఆలయ ఆస్తులను స్వాధీనం చేసుకుని, ఆలయాలకు ఆర్థిక స్వయం ప్రతిపత్తి కూడా కల్పించామన్నారు.

బ్యాడ్మింటన్ గ్రౌండ్‌కు శంకుస్థాపన...

ఇదిలా ఉండగా చెన్నై కార్పొరేషన్ అంబత్తూరు జోన్ అన్నానగర్ వెస్ట్ ఎక్స్‌టెన్షన్ మిలీనియం పార్కులో రూ.93లక్షలతో నిర్మించనున్న బ్యాడ్మింటన్ గ్రౌండ్‌కు మంత్రి శేఖర్‌బాబు శంకుస్థాపన చేశారు. ఆ పార్కులో రూ.25లక్షలతో నిర్మించిన మహిళల వ్యాయామశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ప్రియ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు నయినార్ నాగేంద్రన్ ప్రచార పర్యటన

● మదురైలో భారీ ఏర్పాట్లు ● హాజరు కానున్న కేంద్రమంత్రులు

ప్యారీస్, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఈనెల 12న సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్త ప్రచార పర్యటన చేపట్టనున్నారు. ఇందుకోసం ఆలయాల నగరంగా ప్రసిద్ధి చెందిన మదురై గడ్డ నుంచి 'తమిళనాడు తలెత్తుకునేలా తమిళుడి పయనం' పేరుతో అసెంబ్లీ ఎన్నికల ప్రచార యాత్రకు శ్రీకారం చుడతారు. ఈ ప్రచారయాత్రను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించనున్నారు. మరో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పొన్‌రాధాకృష్ణన్, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీనియర్ నేతలు ఎస్.చక్రవర్తి, కరాటే త్యాగరాజన్, ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. నయినార్ నాగేంద్రన్ రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో ప్రచారాన్ని చేపట్టనున్నారు. నయినార్ పర్యటన తొలివిడత టైంటేబుల్‌ను బీజేపీ ప్రధాన కార్యాలయం కమలాలయం శనివారం విడుదల చేసింది. తొలిరోజు మినహాయించి మిగతా రోజుల్లో సాయంత్రం 5 గంటలకు బహిరంగ సభలుంటాయి.

పర్యటన వివరాలు.....

ఈ నెల 13న శివగంగ, 14న చెంగల్పట్టు నార్త్, 15న నార్త్ చెన్నై, 16న సెంట్రల్ చెన్నై పార్లమెంట్ నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. ఆ తర్వాత ఈ నెల 24న పెరంబలూరు, అరియలూర్, 25న తంజావూరు నార్త్, 27న తిరుచ్చి నగరం, 28న దిండుగల్ ఈస్ట్, 29న నామక్కల్ ఈస్ట్ నియోజకవర్గాల్లో బహిరంగ సభలు జరుగుతాయి. ఇక నవంబరు 3న ఈరోడ్, 4న కోయంబత్తూరు నార్త్, 5న నీలగిరి, 6న తిరుప్పూర్ ఈస్ట్, 7న సేలం వెస్ట్, 8న ధర్మపురి, 10న తిరుపత్తూరు, 11న తంజావూరు సౌత్, 12వ తేదీ పుదుకోట ఈస్ట్, 13న రామనాథపురం, 14న విరుదునగర్, 15న తూత్తుకుడి, 17 తిరునల్వేలి, 18, 19వ తేదీల్లో కన్నియాకుమారి, 20న తెన్‌కాశి, 21 తిరునల్వేలి, సౌత్, 22న తూత్తుకుడి సౌత్ నియోజకవర్గాల్లో నయినార్ ప్రచారం చేస్తారు.



శ్రీవిల్లిపుత్తూర్ ఆండాళ్ ఆలయంలో నయినార్ నాగేంద్రన్

జనవరిలో ఎన్డీయే కూటమిపై స్పష్టత...

రాష్ట్రంలో ఎన్డీయే కూటమిపై జనవరిలో స్పష్టత ఏర్పడుతుందని బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పేర్కొన్నారు. సోమవారం మదురైలో రాష్ట్రవ్యాప్త పర్యటన ప్రారంభించనున్న సందర్భంగా ఆయన శనివారం విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరులో ప్రసిద్ధి చెందిన ఆండాళ్ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ...తమిళనాడు ప్రభుత్వ అధికారిక గుర్తుగా ఉన్న శ్రీవిల్లిపుత్తూరు ఆలయ గోపురం వద్ద రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం వచ్చే ఏడాది ఏర్పడాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఇప్పటివరకు 62 నియోజవర్గాల్లో ప్రచార పర్యటన పూర్తిచేశారని, ఆయనలాగే తాను కూడా 234 నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు.

కరూర్ దుర్ఘటనపై త్వరలో సిట్ నివేదిక

చెన్నై, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో సెప్టెంబరు 27న టీవీకే అధినేత విజయ్ రోడ్‌షో నిర్వహించిన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41మంది మృతి చెందిన సంఘటనపై ముమ్మరంగా విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) త్వరలో నివేదిక సమర్పించనుందని ఆ బృందం అధికారులు తెలిపారు. ఈ సంఘటనపై ఐజీ అస్రాగార్గ్ నాయకత్వంలో 30 మంది సభ్యుల బృందం విచారణ జరుపుతున్న విషయం విదితమే. ఈ నెల 5వ తేదీ నుంచి ఈ బృందం సభ్యులు తొక్కిలాట జరిగిన వేలుచ్చామిపురం వద్ద, ఆస్పత్రిలో చికిత్సలు పొందుతుండిన బాధితులను, స్థానిక పోలీసు అధికారులను దశలవారీగా విచారించారు. వంద కంటే ఎక్కువ మంది వద్ద దర్యాప్తు జరిపారు. ప్రస్తుతం 70 శాతం విచారణ పూర్తయ్యిందని, మరో వారం పది రోజుల్లో దర్యాప్తు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా కరూర్ దుర్ఘటన నేపథ్యంలో రాజకీయ పార్టీల రోడ్‌షోలకు సంబంధించి విధి విధానాలను రూపొందించే నిమిత్తం ఏర్పాటైన జస్టిస్ అరుణాజగదీశన్ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించడానికి 3 నెలలు పడుతుందని తెలుస్తోంది. కరూర్‌లో జస్టిస్ అరుణా జగదీశన్ కార్యాలయం ఏర్పాటు చేసుకుని, సంబంధీకులకు సమన్లు పంపి విచారణ జరుపుతారని ప్రభుత్వ ఉన్నతాధికారులు తెలిపారు.

టీవీకే శ్రేణులకు ఈపీఎస్ అంటే ఎంతో ఇష్టం!

● మాజీ మంత్రి సెల్లూరు కె.రాజు

చెన్నై, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామిని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ శ్రేణులంతా ఇష్టపడుతున్నారని, కనుకనే పలు చోట్ల ఆయన్ను స్వాగతిస్తూ ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారని మాజీ మంత్రి సెల్లూరు కె.రాజు అన్నారు. మదురై వెస్ట్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని విలాంగుడిలో కొత్తగా నిర్మించిన రేషన్ దుకాణాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈపీఎస్ ప్రచార సభల్లో టీవీకే జెండాలు కడుతున్నారని, ఆ పార్టీ నేత, నటుడు విజయ్‌కి మొట్టమొదట మద్దతు పలికింది ఈపీఎస్ అనే అభిమానంతో ఇవన్నీ చేస్తున్నారని భావించవచ్చన్నారు. ఈపీఎస్‌ని టీవీకే పార్టీ శ్రేణుల మొదటి నుంచి మిత్రభావంతోనే చూస్తున్నారు తప్ప శత్రువుగా భావించడం లేదన్నారు. టీవీకే కార్యకర్తలు ఆయన ప్రసంగాన్ని ఓపికగా వింటున్నారని చెప్పారు. టీవీకే శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నట్లు గమనించిన ఈపీఎస్ కూడా ప్రతి సభలోనూ ఆ పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలుపుతున్నారని సెల్లూరు కే రాజు చెప్పారు. అన్నాడీఎంకే సభలో టీవీకే కార్యకర్తలు ఇలా ప్రవర్తించడాన్ని చూసి సహించలేక అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్ పసలేని విమర్శలు చేస్తున్నారన్నారు. అన్నాడీఎంకేతో టీవీకే ఎన్నటికీ పొత్తు కుదుర్చుకోదంటూ దినకరన్ పెడుతున్న శాపనార్థాలు ఫలించవన్నారు. రాష్ట్ర చరిత్రలో అన్నాడీఎంకే కార్యకర్తలెవరూ పార్టీ జెండాలను పట్టుకుని ఇతర పార్టీల నేతల సమావేశాలకు వెళ్ళిన దాఖలాలు లేవని అన్నారు. టీవీకే అన్నాడీఎంకే కూటమిలో చేరితే ఆ పార్టీని భుజాలకెత్తుకుని హర్షం ప్రకటిస్తామని కూడా ఆయన ప్రకటించారు. ప్రస్తుతం టీవీకే శ్రేణులంతా క్రమశిక్షణతో నడచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సెల్లూరు కే రాజు

అన్నాడీఎంకే ప్రచారంలో
ఈపీఎస్‌ను పొగుడుతూ టీవీకే బ్యానర్లు

ఈరోడ్ జిల్లా మొడకురిచ్చిలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి రోడ్‌షోలో పాల్గొన్న సందర్భంగా ఆయన్ను పొగడుతూ తమిళగవెట్రి కళగం ఏర్పాటు చేసిన రెండు ఫ్లెక్సీలు చర్చకు దారితీశాయి. ఓ ఫ్లెక్సీలో 'తలైవా (విజయ్) నిన్ను వ్యతిరేకించడానికి వెయ్యిమంది శత్రువులున్నా, ఎన్నికల్లో గెలిచేందుకు ఈపీఎస్ అండగా ఉంటే చాలు' అంటూ విజయ్ అభిమానులు, మొడకురిచ్చి నియోజకవర్గం పార్టీ నిర్వాహకులు ఈపీఎస్, టీవీకే నేత విజయ్ నిలువెత్తు ఫోటోలు ముద్రించి ఉన్నాయి. మరో ఫ్లెక్సీలో 'కష్టకాలంలో మాకు అండగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి ఈపీఎస్‌కు ధన్యవాదాలు' అంటూ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ రెండు ఫ్లెక్సీలు మొడకురిచ్చి అంతటా చర్చనీయాంశంగా మారాయి.



ఈపీఎస్‌ను స్వాగతిస్తూ టీవీకే నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

సమాచార దర్శిని

నేడు పీజీ ఉపాధ్యాయుల రాతపరీక్ష

పెరంబూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 1,996 పీజీ ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ఆదివారం రాతపరీక్ష నిర్వహించనున్నట్టు ఉపాధ్యాయ ఎంపిక బోర్డు పేర్కొంది. పరీక్షకు 2,36,530 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 1,74,410 మంది పురుషులు, 63,113 మంది మహిళలు, ఏడుగురు హిజ్రాలు, 3,734 మంది దివ్యాంగులు ఉన్నారని తెలిపింది. ఈ పరీక్ష కోసం రాష్ట్ర వ్యాప్తంగా 809 కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని టీఆర్బీ తెలిపింది. అభ్యర్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, 9.30 గంటలకు కేంద్రాలు గేట్లు మూసివేస్తామని తెలిపింది.

7.02 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

పెరంబూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కురువై సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు 7.02 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి చక్రపాణి తెలిపారు. సెప్టెంబరు 1వ తేది నుంచి రాష్ట్రవ్యాప్తంగా 1,728 కొనుగోలు కేంద్రాల ద్వారా ఈనెల 8వ తేది వరకు 97,125 మంది రైతుల నుంచి 7.02 లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసి, రైతులకు రూ.1,606.65 కోట్లు చెల్లించామని తెలిపారు. గత ఏడాది ఇదే సీజన్‌లో 979 కొనుగోలు కేంద్రాల ద్వారా 44,913 మంది రైతుల నుంచి 3.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. గత ఏడాదితో పోల్చితే, ఈ ఏడాది అదనంగా 52,212 మంది రైతుల నుంచి 3.92 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. డెల్టా జిల్లాల నుంచి ప్రతిరోజు 35,000 మెట్రిక్ టన్నుల ధాన్యం పొరుగు రాష్ట్రాలు, నిల్వ కేంద్రాలకు తరలిస్తున్నట్టు మంత్రి తెలిపారు.

'పాస్‌పోర్ట్' అదనపు సమయం

పెరంబూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై మండల పాస్‌పోర్ట్ అధికారిని ప్రతి మంగళవారం కలుసుకునేందుకు అదనపు సమయం కేటాయించారు. చెన్నై మండల పాస్‌పోర్ట్ అధికారిగా విజయకుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత, పాస్‌పోర్ట్, ఇతర విషయాలను నేరుగా కలుసుకుని తెలుసుకునేలా చర్యలు చేపట్టారు. ఈక్రమంలో ప్రతి మంగళవారం అదనపు సమయం కేటాయించారు. ఈ ప్రక్రియకు అభ్యర్థుల నుంచి స్పందన రావడంతో, ఈ నెల 14వ తేది నుంచి అభ్యర్థులు కలుసుకునే సమయాన్ని గంట పొడిగించారు. అధికారిని కలుసుకునేందుకు ఆసక్తి ఉన్న వారు rpo.chennai@gov.inలో, నెం.044- 28518848లో సంప్రదించి పేరు నమోదుచేసుకోవాలని ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం తెలిపింది.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానంలో క్లబ్ నిర్వాహకులు

తిరుత్తణి, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం వృద్ధులకు అన్నదానం జరిగింది. ముఖ్యఅతిథిగా క్లబ్ అధ్యక్షుడు లోకనాథుడు హాజరై వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా శనివారం వృద్ధులకు అన్నదానం చేసినట్టు తెలిపారు. క్లబ్ నిర్వాహకులు గురుమూర్తి, పార్థశెట్టి, విజయ్‌కుమార్,ప్రసాద్,హేమాద్రి తదితరులుపాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కళాశాల నిర్వాహకులు

వేలూరు, అక్టోబర్11(ఆంధ్రజ్యోతి):వేలూరు జిల్లా గుడియాత్తంలోని అత్తి నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్యదినోత్సవాలు శనివారంఘనంగా జరిగాయి. ఇందులో ముఖ్యఅతిథులుగా ప్రముఖ కిడ్నీ వైద్యనిపుణుడు సౌందరరాజన్ పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వృత్తులకంటే వైద్యవృత్తి గొప్పదని,అందువల్లే ప్రజలు భగవంతుడి తర్వాత స్థానాన్ని డాక్టర్లకు ఇస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ బాలరాజ్, డాక్టర్ మహేష్ రాజమణి సహా పలు విభాగాలకు చెందిన డాక్టర్లు, నర్సులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమిదే విజయం

● కేంద్ర మంత్రి ఎల్.మురుగన్



పళని క్షేత్రంలో కేంద్రమంత్రి మురుగన్‌కు ఆలయ మర్యాదలతో సత్కారం

ప్యారీస్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి మెజారిటీ సీట్లను కైవసం చేసుకుంటుందని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ ఆశాభావం వ్యక్తం చేశారు. దిండుగల్ జిల్లా పళనిలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన దండాయుధపాణి ఆలయాన్ని శనివారం ఉదయం బీజేపీ సీనియర్ నేతలతో కలిసి ఆయన దర్శించుకున్నారు. కేంద్రమంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా సత్కరించి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల మురుగన్ మీడియాతో మాట్లాడుతూ... 234 అసెంబ్లీ స్థానాలకు 2026లో ఎన్నికలను ఎదుర్కొనేందుకు బీజేపీ సిద్ధమైందన్నారు. సోమవారం రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆలయాల నగరమైన మదురై నుంచి ప్రారంభించనున్న ప్రచారయాత్రను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభిస్తారని, తాను కూడా పాల్గొంటానని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ పదేళ్లలో సాధించిన విజయాలు, పథకాలపై ప్రచారం సాగుతోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమిని అధికస్థానాల్లో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేంద్రమంత్రి తెలిపారు.

రూ.1.26 లక్షలు పలికిన శ్రీవారి లడ్డూ ప్రసాదం

ప్యారీస్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేట చిన్నతంబిమొదలివీధిలో వేంకటేశ్వరస్వామి పవిత్ర గొడుగుల 17వ వార్షికోత్సవం-2025 సందర్భంగా శనివారం లోకకల్యాణార్థం విశేష పూజలను నిర్వహించారు. గురు,శుక్ర వారాల్లో సుమారు ఐదువేల మందిపైగా భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పి.వెంకటరత్నం, సీహెచ్.సుబ్రమణ్యం, పి.అశోక్‌కుమార్, ఎంఎస్.మధు, వి.శ్రీనివాసులు, ఏటీ.గుణ, అనిశెట్టి గున్నయ్య తదితర కమిటీ సభ్యుల పర్యవేక్షణలో శ్రీదేవి,భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామిని వేదికపై కొలువుదీర్చి, పుష్పాలు, సుంగధ ద్రవ్యాల మాలలతో సుందరంగా అలంకరించి శాస్త్రోక్తంగా హారతిపూజలు నిర్వహించారు. భక్తుల గోవిందనామస్మరణలతో వేదిక ప్రాంగణం మారుమోగింది. పూజారి జోలా ప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ పూజల్లో శ్రీవారికి ప్రత్యేకంగా తయారుచేసి నివేదించిన లడ్డూప్రసాదాన్ని జె.శ్రీనివాసులు కంపెనీ అధినేత శ్రీనాథ్ వేలంలో రూ.1,26,000కు దక్కించుకున్నారు. వరుసగా మూడోసారి స్వామివారి ప్రసాదాన్ని కైవసం చేసుకున్న శ్రీనాథ్‌ను నిర్వాహకులు సత్కరించారు.



ప్రత్యేక పూజల్లో కమిటీ నిర్వాహకులు

దీపావళి ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకార్యర్థం ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు దక్షిణ రైల్వే పేర్కొంది.

● నెం.06255 కేఎస్ఆర్ బెంగళూరు - ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18, 21, 25 తేదీల్లో కేఎస్ఆర్ బెంగళూరు నుంచి ఉదయం 8.05 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 2.45 గంటలకు సెంట్రల్ చేరుకుంటుంది. నెం.06256 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - కేఎస్ఆర్ బెంగళూరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 18, 21, 25 తేదీల్లో చెన్నై సెంట్రల్ నుంచి సాయంత్రం 4.30 గంటలకు బయల్దేరి రాత్రి 10.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

● నెం.06156 తిరునల్వేలి - చెంగల్పట్టు ప్రత్యేక రైలు ఈ నెల 21, 22 తేదీల్లో తిరునల్వేలి నుంచి తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1.15 గంటలకు చెంగల్పట్టు చేరుకుంటుంది. నెం.06155 చెంగల్పట్టు - తిరునల్వేలి ప్రత్యేక రైలు ఈ నెల 21, 22 తేదీల్లో చెంగల్పట్టు నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి రాత్రి 11.55 గంటలకు తిరునల్వేలి చేరుకుంటుంది.

● నెం.06044 బోదనూరు - ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 19న బోదనూరులో రాత్రి 11.20 గంటలకు బయల్దేరి 20న ఉదయం 8.45 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. నెం.06043 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - బోదనూరు ఎక్స్‌ప్రెస్ రైలు 20వ తేది చెన్నై సెంట్రల్ నుంచి మధ్యాహ్నం 12.15 గంటలకు బయల్దేరి రాత్రి 10 గంటలకు బోదనూరు చేరుకుంటుంది.

● నెం.06001 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - మంగళూరు సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20వ తేది చెన్నై సెంట్రల్ నుంచి మధ్యాహ్నం 12.15 గంటలకు బయల్దేరి 21న ఉదయం 8 గంటలకు మంగళూరు సెంట్రల్ చేరుకుంటుంది. నెం.06002 మంగళూరు సెంట్రల్ - ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 21వ తేది మంగళూరు సెంట్రల్ నుంచి సాయంత్రం 4.35 గంటలకు బయల్దేరి 22వ తేది ఉదయం 10.15 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): వేలూరు ఆక్సీలియం మహిళా కళాశాల, నరువి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలు జరిగాయి. శిబిరాలను వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరువి ఆస్పత్రి అధ్యక్షుడు సంపత్ మాట్లాడుతూ... కొన్నేళ్లుగా కళాశాలలో రక్తదాన, వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలూరు కార్పొరేషన్ మేయర్ సుజాత, ఆక్సీలియం కళాశాల నిర్వాహకురాలు అముదా, ప్రిన్సిపల్ ఆరోగ్య జయశీలి, సెక్రటరీ మేరీ, జిల్లా ఆరోగ్యశాఖ డైరెక్టర్ భరణీధరన్, తిరువళ్లువర్ యూనివర్శిటీ నిర్వాహకుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ కోసం విత్తనాల సేకరణ



కార్యక్రమంలో ఎమ్మెల్యే అమ్ములు, దినేష్ శరవణన్ తదితరులు

వేలూరు, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తంలో శనివారం ఉదయం సమాజ సేవకుడు దినేష్ ఆధ్వర్యంలో అటవీ సంరక్షణ కోసం విత్తనాల సేకరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే అమ్ములు విజయన్, సబ్ కలెక్టర్ శుభలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. అడవులను సంరక్షించడానికి యేటా విత్తనాలను సేకరించి వాటిని అటవీ ప్రాంతాల్లో చల్లుతున్నామని చెప్పారు. అదేవిధంగా ఈ ఏడాది గుడియాత్తం తిరుమగల్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల తోడ్పాటుతో విత్తనాల సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌బాబు, అటవీశాఖ అధికారులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



విజేతలకు చెక్కును అందిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడాపోటీలు శనివారం ఉదయం వేలూరు సమీపంలోని ఆదల మైదానంలో జరిగాయి. ఈ పోటీల్లో 38 జిల్లాలకు చెందిన 646 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుబ్బులక్ష్మి మాట్లాడుతూ... విద్యార్థులు చదువుల్లోనే కాకుండా క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు.అనంతరం విజేతలకు రూ.12లక్షల చెక్కు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రన్, సెక్రటరీ శివ, కాట్పాడి మండల అధ్యక్షురాలు పుష్పలత, కౌన్సిలర్ విమల, జిల్లా క్రీడాశాఖ అధికారులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని కోరుతూ పౌష్టికాహార సిబ్బంది నిరసన

తిరుత్తణి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచాలని కోరుతూ తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని ప్రాంతీయ అభివృద్ధి శాఖ కార్యాలయం ముందు తమిళనాడు పౌష్టికాహార ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ఈ సందర్భంగా సంఘ నాయకులు మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహార ఉద్యోగుల విధులను ఆన్‌లైన్ చేస్తూ అందుకుగాను ఉచిత సిమ్‌కార్డులను మంజూరు చేసిందన్నారు. తమ వద్ద ఆండ్రాయిడ్ ఫోన్లు లేవని, కీపాడ్ ఫోన్లు ఉన్న తమకు అందులో విధులు ఎలా నిర్వహించగలమని ప్రశ్నించారు. కొన్నేళ్లుగా పౌష్టికాహార ఉద్యోగులకు ఇస్తున్న వేతనాలను పెంచి తమకు న్యాయం చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. పౌష్టికాహార మహిళ ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బెయిలు కోరుతూ బుస్సీ ఆనంద్ మళ్లీ పిటిషన్

పెరంబూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ముందస్తు బెయిలు కోరుతూ తమిళగ వెట్రి కళగం ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ మళ్లీ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. కరూర్‌లో గతనెల 27 జరిగిన టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందగా... ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్, సంయుక్త ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్‌పై కరూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే టీవీకే జిల్లా కార్యదర్శి మదియళగన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, అజ్ఞాతంలోకి వెళ్లిన ఆనంద్, నిర్మల్ కుమార్ కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ముందస్తు బెయిలు కోరుతూ ఆనంద్, నిర్మల్‌కుమార్ వేర్వేరుగా దాఖలుచేసిన పిటిషన్లను హైకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో, ఆనంద్ మళ్లీ ముందస్తు బెయిలు కోరుతూ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానుంది.

'విశ్వనరుడు- గుర్రం జాషువా'పై 26న బొగ్గరపు రాధాకృష్ణమూర్తి ప్రసంగం

టి.నగర్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల26న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 166వ ప్రసంగ కార్యక్రమంగా 'విశ్వనరుడు-గుర్రం జాషువా' అనే అంశంపై నెల్లూరుకు చెందిన ఆధ్యాత్మిక సాహిత్య ఉపన్యాసకుడు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి ప్రసంగించనున్నారని సంస్థ అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు తెలిపారు. టి.నగర్ ఆంధ్రాక్లబ్ కృష్ణాహాల్‌లో ఈనెల 26 సాయంత్రం 6.30 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని, సాహితీ ప్రియులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

తాంతోని వెంకటరమణ ఆలయంలో సెంథిల్‌బాలాజీ అన్నదానం

చెన్నై, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కరూరు నియోజకవర్గంలోని తాంతోని కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో పురటాసి నాలుగో శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. ఆ సందర్భంగా మాజీ మంత్రి, కరూరు ఎమ్మెల్యే సెంథిల్‌బాలాజీ భక్తులకు అన్నదానం చేశారు. పురటాసి నాలుగో శనివారం పురస్కరించుకుని వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అటు పిమ్మట మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం సమీపంలోని ప్రైవేటు కల్యాణమండపంలో సెంథిల్ బాలాజీ, డీఎంకే స్థానిక నేతలు కలిసి భక్తులకు అన్నదానం చేశారు. ఇదే విధంగా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్, ఆ పార్టీ స్థానిక నాయకులు భక్తులకు అన్నదానం చేశారు.



పురటాసి నాలుగోశనివారం సందర్భంగా భక్తులకు అన్నదానం చేస్తున్న మాజీ మంత్రి సెంథిల్ బాలాజి

మధుమేహంపై అవగాహన పెంచుకోండి



బాన్నీ సాబోకు ప్రశంసాపత్రం అందిస్తున్న విజయ్ విశ్వనాథన్

చెన్నై, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలో టైప్- 1 మధుమేహం బారిన పడుతున్న బాధితుల సంఖ్యలో ప్రపంచవ్యాప్తంగా భారత్ ద్వితీయ స్థానంలో ఉందని సౌత్‌ఈస్ట్ ఏషియా ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్ ఛైర్మన్ డాక్టర్ బాన్నీ సాబో అన్నారు. గిండీ వద్దనున్న స్టార్‌హోటల్‌లో శనివారం ఉదయం స్థానిక రాయపురంలోని ఎంవీ హాస్పిటల్ ఫర్ డయాబెటిస్, ప్రొఫెసర్ ఎం.విశ్వనాథన్ డయాబెటిస్ రీసెర్చ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన సభలో ఆయన ప్రొఫెసర్ ఎం.విశ్వనాథన్ సెంటినరీ అవార్డు ప్రసంగించారు. ప్రస్తుతం దేశంలో 9.41లక్షల మంది దీర్ఘకాలిక మధుమేహంతో బాధపడుతున్నారన్నారు. అధికమవుతున్న మధుమేహాన్ని అరికట్టడానికి అన్నింటికంటే ముందు ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ప్రజలు ముందస్తు వైద్యపరీక్షలు చేసుకోవాలని, ఆహార నియమాలు పాటించాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రజారోగ్య విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎ.సోమసుందరం, ప్రొఫెసర్ ఎం. విశ్వనాథన్ డయాబెటిస్ రీసెర్చ్ సెంటర్ డీన్ డాక్టర్ ఎస్ఎన్ నరసింగన్, అసోసియేట్ డీన్ డాక్టర్ జయశ్రీ గోపాల్, ఎంవీ హాస్పిటల్ ఫర్ డయాబెటిస్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్ విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నూతన భవనాలకు శంకుస్థాపన



శంకుస్థాపన పూజల్లో ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ తదితరులు

తిరుత్తణి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని కీచలంలో రూ.16.55లక్షలతో నూతనంగా నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్రం, బొమ్మరాజుపేటలో రూ.14లక్షలతో నిర్మించనున్న ఆలయ వేదిక ప్రాంగణం, పొదటూర్‌పేటలో రూ.15లక్షలతో ప్రభుత్వ రవాణాశాఖ డిపో భవనాల నిర్మాణాలకు శనివారం ఉదయం ఎమ్మెల్యే చంద్రన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతోందన్నారు. ప్రజా సంక్షేమం కోసం నూతన పథకాలను అమలు చేస్తోందన్నారు. అనంతరం ఆయన పొదటూర్‌పేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంకే మండల కార్యదర్శి రవీంద్ర, నిర్వాహకులు గోపి, గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి హత్య కేసులో ఆరుగురి అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన రెడ్‌హిల్స్ వద్ద ప్లాస్టిక్ కుర్చీలు తయారుచేసే కంపెనీలో చోరీకి యత్నించాడనే అనుమానంతో యువకుడిని హతమార్చిన కేసులో పోలీసులు సంఘటన జరిగిన 24గంటల వ్యవధిలోనే ఆరుగురిని అరెస్ట్ చేశారు. రెడ్‌హిల్స్ సమీపంలోని కాట్టునాయకన్‌నగర్‌కు చెందిన మణిమారన్ (26) పాత పేపర్లు, ప్లాస్టిక్ వస్తువులు సేకరించి విక్రయించేవాడు. గురువారం రాత్రి ప్లాస్టిక్ కుర్చీలు తయారుచేసే కంపెనీ వద్దకు వెళ్లిన మణిమారన్ చోరీకి వచ్చాడన్న అక్కడి సిబ్బంది అతన్ని ఇనుప స్తంభానికి కట్టేసి, గుండుగీసి, కర్రతో తీవ్రంగా కొట్టడంతో ప్రాణాలు విడిచాడు. ఈ విషయం పోలీసులకు తెలుస్తుందన్న భయంతో నిందితులు ఆ మృతదేహాన్ని మురికి కాలువలో పడేసి వెళ్లిపోయారు. స్థానికుల సమాచారంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారణ జరిపి అనుమానంతో ప్లాస్టిక్ కంపెనీ యజమాని రెహ్మాన్, ఆయన కుమారుడు సయ్యద్ ఫరూక్, టి.నగర్‌కు చెందిన అబ్దుల్ మాలిక్‌తో పాటు ఆరుగురిని శనివారం ఉదయం అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టు ఉత్తర్వుల మేరకు పుళల్ జైలుకు తరలించారు.

తల్లి హత్య కేసులో తనయుడికి 14యేళ్ల జైలు

వేలూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గత 2023 లో రాణిపేట జిల్లా అరక్కోణం సమీపంలోని గురువరాజుపేట నరసింహన్‌వీధిలో జరిగిన మహిళ హత్య కేసులో ఆమె కుమారుడికి 14 యేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువడింది. అమృతమ్మాళ్ (80)ని ఆమె కుమారుడు రాజా (45) చిత్రహింసలకు గురిచేసి ఆపై హత్య చేశాడు. ఈ కేసుపై రాణిపేట జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు మేజిస్ట్రేట్ సెల్వం విచారణ జరిపారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన మీదట నిందితుడు రాజాకు 14యేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు.

భారీవర్షాలపై అప్రమత్తం

● వాతావరణశాఖ హెచ్చరిక

వేలూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో రానున్న వారం రోజులు రాష్ట్రవ్యాప్తంగా భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని, అధికారులు దీనిపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వాతావరణశాఖ తిరుపత్తూరు జిల్లా యంత్రాంగాన్ని హెచ్చరించింది. తమిళనాడు-ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో కురుస్తున్న భారీ వర్షాలకు పెదమంగళంలోని పాలార్ ఆనకట్ట నుంచి సెకనుకు 300 క్యూసెక్కుల నీరు విడుదలవుతోందని ఇది ఇలాగే కొనసాగితే నీటి ఉధృతి పెరిగి లోతట్టు ప్రాంతాలు జలమయమవుతాయన్నారు. ఈక్రమంలో జిల్లాలో ని పుల్లూరు, తిమ్మంపేట, అవరంగుంబం, వడక్కుపట్టు, రామనాయకన్‌పేట, అంబలూరు, కొడైయాంచి, పాత కిరణంబాడి, వాణియంబాడి తదితర ప్రాంతాల్లోని నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించింది.

బాలిక నడిపిన స్కూటర్ ఢీకొని ఒకరి మృతి

పెరంబూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలిక నడిపిన స్కూటర్ ఢీకొని ఒకు మృతి చెందారు. కడలూరు జిల్లా తోలార్ గ్రామానికి చెందిన ఆనంద సెల్వం శుక్రవారం ఆళిచ్చికుండి నుంచి తోలార్‌కు బైక్‌పై బయల్దేరాడు. అదే సమయంలో, పెన్నాడం ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలిక స్కూటర్‌లో పాఠశాలకు వెళుతోంది. మురుగన్‌గుడి సమీపంలో సెల్వం బైక్‌ను విద్యార్థిని నడుపుతున్న స్కూటర్ ఢీకొంది. ఈ ఘటనలో బైక్ నుంచి కిందపడిన సెల్వం తలకు బలమైన గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై మృతుడి బంధువుల ఫిర్యాదుతో, 15 ఏళ్ల విద్యార్థినికి స్కూటర్ ఇచ్చిన తల్లిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

బిడ్డకు జన్మనిచ్చిన బాలిక

పెరంబూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలిక బిడ్డకు జన్మనిచ్చింది. ఈ వ్యవహారంలో యువకుడిని పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. నామక్కల్ జిల్లాకు చెందిన యువకుడికి వివాహమై ఇద్దరు కుమారులున్నారు. సదరు యువకుడు వాహనాల రిపేర్ దుకాణం నడుపుతున్నాడు. 2023వ సంవత్సరంలో ఓ బాలిక తన బైక్‌ను రిపేర్‌కు ఇచ్చింది. అనంతరం ఆ బాలికతో యువకుడు పరిచయం పెంచుకున్నాడు. 2024లో బాలికను తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ కారణంగా గర్భం దాల్చిన బాలిక కొద్దిరోజుల క్రితం నామక్కల్ ప్రభుత్వాస్పత్రిలో బిడ్డకు జన్మనిచ్చింది. ఆస్పత్రి వైద్యులు ఈ విషయాన్ని నామక్కల్ పోలీసులకు తెలియజేశారు. బాలికను విచారించిన పోలీసులు, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి యువకుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

బిసెంట్‌నగర్ బీచ్‌లో ఇద్దరు విద్యార్థుల మృతి

పెరంబూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బిసెంట్ నగర్ బీచ్‌లో రాకాసి అలల్లో చిక్కుకుని ఇద్దరు కళాశాల విద్యార్థులు మృతిచెందారు. నగరంలోని ఓ కళాశాలలో చదువుతున్న కవిన్ ప్రసాద్, రోహిత్, మహ్మద్ ఆదిల్ స్నేహితులతో కలసి బిసెంట్ నగర్ బీచ్‌కు వెళ్లారు. వారందరూ సరదాగా తీరంలో స్నానం చేస్తుండగా, ఊహించని విధంగా వచ్చిన రాకిసి అలలో ప్రసాద్, రోహిత్, మహ్మద్ చిక్కుకున్నారు. గమనించిన జాలర్లు మహ్మద్‌ను రక్షించగా, మిగిలిన వారు అలల్లో కొట్టుకుపోయారు. కొద్దిసేపటికి మృతదేహాలు తీరానికి కొట్టుకొచ్చాయి.

కామ్రేడ్ నల్లకన్ను డిశ్చార్జి



సీపీఐ సీనియర్ నేత నల్లకన్ను

పెరంబూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య సమస్యలకు తోడు, ఇంట్లో జారిపడి గాయపడ్డ సీపీఐ సీనియర్ నేత నల్లకన్ను (100) ఒకటిన్నర నెల తర్వాత ఆస్పత్రి నుంచి సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జి అయ్యారు. ఆగస్టు 22న నల్లకన్ను తన నివాసగృహంలో కాలుజారి పడటంతో ఆయన తల, వేలికి గాయాలయ్యాయి. వెంటనే కుటుంబీకులు ఆయన్ను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. ఆ తర్వాత 24న సాయంత్రం భోజనం చేస్తుండగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అత్యవసర చికిత్సా విభాగంలో ఆయనకు కృత్రిమ శ్వాసద్వారా వైద్య నిపుణులు చికిత్సలందించారు. ఈ క్రమంలో నల్లకన్ను ఆరోగ్యం కుదుటపడడంతో శుక్రవారం సాయంత్రం ఆయన్ను డిశ్చార్జి చేసినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళా రైతు సహా ఇద్దరి మృతి

పెరంబూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పంటను జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు ఏర్పాటుచేసి విద్యుత్ కంచెకు చిక్కుకున్న ఓ మహిళా రైతు సహా ఇద్దరు మృతిచెందారు. పెరంబలూరు జిల్లా వెంబావూరుకు చెందిన పెరియస్వామి (62), అదే గ్రామానికి చెందిన కందస్వామి భార్య చెల్లమ్మాళ్ (55) తమకు సొంతమైన భూమిలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. పంటను జంతువుల బారి నుంచి కాపాడుకునేలా పెరియస్వామి చట్ట విరుద్ధంగా తన పొలం చుట్టూ విద్యుత్ కంచె ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో, పెరియస్వామి, ఆయన భూమి పక్కనే తన భూమిలో పురుగుల మందు చల్లేందుకు శనివారం ఉదయం వెళ్లారు. ఊహించని విధంగా ఇరువురు విద్యుత్ కంచెకు తగిలి షాక్‌తో ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న పోలీసులు, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా పురటాసి శనివారం వేడుకలు



ప్రత్యేక అలంకారంలో శ్రీవారు

వేలూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పురటాసి మాసాన్ని పురస్కరించు కుని వేలూరులోని టీటీడీ సమాచారం కేంద్రంలోని ఆలయంలో శనివారం ఉద యం శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి స్వామివారికి వెండికవచాన్ని అలంకరింపజేశారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

తిరుమల పాదయాత్ర భక్తులకు అన్నదానం



టీడీపీ నాయకుడు భీమినేని చిట్టిబాబునాయుడికి సత్కారం

తిరుత్తణి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని ఎస్ఎస్‌మహల్‌లో శనివారం మధ్యాహ్నం పురటాసి మాసాన్ని పురస్కరించుకుని తిరుమలకు పాదయాత్రగా వెళ్లే భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరుకు చెందిన టీడీపీ రాష్ట్ర నాయకుడు భీమినేని చిట్టిబాబునాయుడు పాల్గొని సుమారు 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జయచంద్ర, శ్రీనివాస మిల్క్ డిస్ట్రిబ్యూటర్ గోపి పాల్గొన్నారు.

సీనియర్ కెమెరామెన్ బాబు కన్నుమూత


బాబు (ఫైల్‌ఫొటో)

సీనియర్ డైరెక్టర్ ఎస్పీ ముత్తురామన్ దర్శకత్వం వహించిన 45 చిత్రాలకు సినిమాటోగ్రాఫర్‌గా పని చేసిన సీనియర్ కెమెరామెన్ బాబు (88) శనివారం వృద్ధాప్య సమస్యలతో తుదిశ్వాస విడిచారు. బాబు అంత్యక్రియలను ఆదివారం నిర్వహిస్తామని ఆయన కుటుంబ సభ్యులు వెల్లడించారు. కెమెరామెన్‌గా కేఎస్ ప్రసాద్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన ఆయన.. నాటి అగ్రనటులైన ఎంజీఆర్, శివాజీ గణేశన్ చిత్రాలకు అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశారు. తమిళం, హిందీ భాషలతో పాటు సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన అనేక చిత్రాలకు ఆయన సినిమాటోగ్రాఫర్‌గా పని చేశారు. వీటిలో 'ప్రియ', 'మురట్టుకాళై', 'నల్లవనుక్కు నల్లవన్', 'పాయుం పులి', 'కళుగు', 'పోకిరి రాజా' తదితర చిత్రాలు ఉన్నాయి. విశ్వనటుడు కమల్ నటించిన 'సకలకలా వల్లవన్', 'తూంగాదే తంబి తూంగాదే' వంటి అనేక చిత్రాలకు ఛాయాగ్రహణం సమకూర్చారు. 2001లో ప్రభు నటించిన 'తాళికాత్త కాళి అమ్మన్' చిత్రం ఆయన సినిమాటోగ్రఫీ చేసిన ఆఖరి చిత్రం. స్థానిక అభిరామిపురం కృష్ణస్వామి వీధిలోని తన స్వగృహంలో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటూ వచ్చిన ఆయన వృద్ధాప్య కారణంగా సోమవారం అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఆళ్వార్‌పేటలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. ఈక్రమంలో శనివారం కన్నుమూశారు. ఆయనకు విశ్వనాథ్, శ్రీధర్ అనే ఇద్దరు కుమారులున్నారు. భార్య గతంలోనే భౌతికంగా దూరమయ్యారు. కెమెరామెన్ బాబు మృతిపట్ల సీనియర్ దర్శకుడు ఎస్పీ ముత్తురామన్ సహా అనేక మంది సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు.

చిత్రజ్యోతి

ఇళయరాజా సంగీతంతోనే మంచి బిజినెస్

● ఆర్వీ ఉదయకుమార్ ● 'మైలాంజి' ఆడియో ఆవిష్కరణ


'మైలాంజి' ఆడియో రిలీజ్

తమ చిత్రానికి 'ఇసైజ్ఞాని' ఇళయరాజా సంగీతం సమకూర్చారంటూ ప్రచారం చేసుకుంటేనే మంచి వ్యాపారం జరుగుతుందని కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్వీ ఉదయకుమార్ అన్నారు. నగరంలో 'మైలాంజి' సినిమా ఆడియో ఆవిష్కరణ వేడుక శుక్రవారం జరిగింది. ఇందులో సినీ ప్రముఖులు ఆర్వీ ఉదయకుమార్, పేరరసు ఏఎల్ విజయ్, సీమాన్, మిష్కిన్, ధనుంజయన్, మీరా కదిరవన్ సహా మాజీ ఏడీజీపీ దినకరన్ తదితర ప్రముఖులు పాల్గొని ఆడియోను రిలీజ్ చేశారు. ఆర్వీ ఉదయకుమార్ ప్రసంగిస్తూ... 'అజయన్ బాలా ఎపుడో విజయపథంలో నడవాల్సిన దర్శకుడు. కానీ, లేట్ బట్ నెవర్ అనే సామెత ప్రకారం ఒక రోజున ఆయన కచ్చితంగా సక్సెస్‌ఫుల్ దర్శకుడుగా అవుతారు. ఈ సినిమాకు ఇళయరాజా ఏ మేరకు సంగీతం కావాలో ఆ స్థాయిలో సమకూర్చారు. అజయన్ బాలాకు దర్శకుడిగా అవకాశం కల్పించిన నిర్మాతను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు అజయన్ బాల మాట్లాడుతూ... 'ఒక మంచి కాన్సెప్టుతో ఈ చిత్రాన్ని రూపొందించాం. ప్రతి ఒక్కరూ చూసి చిత్రాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నా' అని పేర్కొన్నారు. చిత్ర నిర్మాత మాట్లాడుతూ... 'సినిమా నిర్మాణం చేపట్టబోతున్నట్టు చెప్పగానే ప్రతి ఒక్కరూ ఆందోళన చెందారు. ఆశ్చర్యంగా చూశారు. కొందరు వద్దన్నారు. కానీ, ఈ సినిమా నాకు ఎన్నో విషయాలను నేర్పించింది. ఈ రోజు ఉన్న మనం రేపు ఉంటామో లేదో తెలియదు. సినిమా వినోదానికి మాత్రమే కాదని అందులో భావోద్వేగాలు నిక్షిప్తమై ఉన్నాయి. అలాంటి అంశాలతో ఈ సినిమాను రూపొందించాం' అని పేర్కొన్నారు. ఆ తర్వాత పలువురు సినీ ప్రముఖులతో పాటు చిత్రబృందం సభ్యులు ప్రసంగించారు. కాగా, శ్రీరామ్ కార్తీక్ హీరోగా నటించిన ఈ చిత్రం అజయ్ అర్జున్ ప్రొడక్షన్స్ పతాకంపై డాక్టర్ అర్జున్ నిర్మాణంలో అజయన్ బాలా దర్శకత్వం వహించారు.

హనీమూన్ షెడ్యూల్ మీరే చెప్పండి





- త్రిష -

తన పెళ్లిపై సోషల్ మీడియాలో వస్తున్న రూమర్స్‌పై హీరోయిన్ త్రిష ఘాటుగా స్పందించారు. 'నా జీవితం గురించి ఇతరులు ప్లాన్ చేస్తుంటే నాకు చాలా ఇష్టం. ఇలాంటి వాళ్లను నేనెపుడూ ప్రేమిస్తూనే ఉంటాను. ఇపుడు నా హనీమూన్ షెడ్యూల్ కూడా చెబుతారేమోనని వేచి చూస్తున్నా' అని వ్యంగ్యంగా స్పందిస్తూనే తన పెళ్లిపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. పైగా ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆమె క్లారిటీ ఇచ్చారు. కాగా, చండీగఢ్‌కు చెందిన ఓ వ్యాపారవేత్తతో త్రిష వివాహం ఫిక్స్ అయిందంటూ సోషల్ మీడియాలో కొద్ది రోజులుగా విస్తృతంగా ప్రచారం సాగుతోంది. దీనిపై త్రిష తన ఇన్‌స్టా ఖాతాలో ఓ పోస్ట్ చేసి స్పష్టత ఇచ్చారు. కాగా, త్రిష ప్రస్తుతం హీరో సూర్య 'కరుప్పు', తెలుగులో చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర'లో నటిస్తున్నారు.

ముగిసిన రజనీ ఆధ్యాత్మిక పర్యటన

ఇటీవల సూపర్‌స్టార్ రజనీకాంత్ చేపట్టిన ఆధ్యాత్మిక పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని చెన్నై చేరుకున్నారు. ఈనెల 25వ తేదీ నుంచి 'జైలర్-2' షూటింగ్‌లో పాల్గొననున్నారు. తీవ్రమైన చలి, దట్టమైనమంచు ఉన్న హిమాలయాలకు ఏడు పదులు దాటిన వయసులోనూ ఆధ్యాత్మిక పర్యటనకు వెళ్లిరావడం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపడేలా చేసింది. తన స్నేహితులతో కలిసి ఇటీవల హిమాలయ పర్యటనకు వెళ్లిన రజనీ... తొలుత బద్రీనాథ్ ఆలయానికి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత బాబాజీ గుహలో ధ్యానం చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెల్సిందే.


రజనీకాంత్


హొగెనేకల్ జలపాతంలో పొంగి ప్రవహిస్తున్న జలాలు

ఉధృతంగా హొగెనేకల్ జలపాతం

దోనెల సవారీపై నిషేధం

చెన్నై, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రెండు రాష్ట్రాల్లో కావేరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ధర్మపురి జిల్లాలోని హొగెనేకల్ జలపాతం ఉధృతంగా మారింది. దీనితో ఆ జలపాతం వద్ద పర్యాటకులను, దోనెల సవారీపై నిషేధం విధించారు. గురువారం ఉదయం ఈ జలపాతంలోకి సెకనుకు 28 వేల ఘనపుటడుగుల మేరకు జలాలు ప్రవేశించాయి. శుక్రవారం ఉదయం ఆ పరిమాణం సెకనుకు 65 వేల ఘనటపుడుగులకు పెరిగింది. దీంతో ప్రధాన జలపాతంపై కాలినడక వంతెన నీటిలో మునిగింది. ఇదే విధంగా సినీ ఫాల్స్ వద్దకూడా నీరు ఉధృతంగా పడుతోంది. దీంతో హొగెనేకల్ జలపాతంలో పర్యాటకులు స్నానం చేయకూడదంటూ జిల్లా కలెక్టర్ ఆర్ సతీష్ ఉత్తర్వు జారీ చేశారు.

శ్రీవిల్లిపుత్తూరు ఆలయంలో తిరుమలేశుడి పట్టుచీరను ధరించిన గోదాదేవి


తిరుమల ఆలయ పట్టుచీరతో అమ్మవారు

పెరంబూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం శ్రీవిల్లిపుత్తూరు ఆలయంలో గోదాదేవికి తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి వచ్చిన పట్టుచీరను శుక్రవారం ఉదయం ధరింపజేశారు. ఇటీవల తిరుమలలో జరిగిన బ్రహ్మోత్సవాల సందర్భంగా గోదాదేవి ఆలయం నుంచి శూడికొడత్త మాలను, సుగంధ వస్తువులను శ్రీవారికి కానుకగా ఆలయ నిర్వాహకులు అందించారు. అందుకు ప్రతిగా తిరుమల ఆలయ నిర్వాహకులు శ్రీవిల్లిపుత్తూరు గోదాదేవికి మేలిమి పట్టుచీరను పంపారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి 7.40 గంటలకు రంగమన్నార్ సమేత ఆండాళ్ అమ్మవారికి పట్టుచీర ధరింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

● భక్తులకు నీరు, మిఠాయిలు అందజేసిన ఇస్లామీయులు


భక్తులకు వాటర్ బాటిల్, స్వీట్లు అందిస్తున్న ఇస్లామీయులు

పెరంబూర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వేర్వేరు మతాలను చెందిన వారు అయినప్పటికీ, పండుగ సమయంలో ఒకరి ఆరాధనను గౌరవించడం, ప్రేమను వ్యక్తపరిచడం చూపరులను కదిలించింది. కోయంబత్తూర్ జిల్లా కుడియలూరులో 300ఏళ్ల ప్రాచీన అరవాన ఆలయం ఉంది. ఈ ఆలయంలో రెండేళ్లకు ఒకసారి వేడుకలు నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, ఈ ఏడాది ఆలయ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వేడుకల్లో కుడియలూరు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా భక్తులు ఊరేగింపుగా ఆలయానికి బయల్దేరారు. ఈ ఆలయం సమీపంలోని మసీదు మీదుగా ఊరేగింపు సాగింది. ఊరేగింపు వస్తున్న సమయంలో, మసీదులో సాయంత్రం నమాజు ముగించిన ఇస్లామీయులు ప్లేట్లలో స్వీట్లు, బిస్కెట్లు, వాటర్ బాటిళ్లను భక్తులకు అందజేసి మతసామరస్యం చాటుకున్నారు.

ఆహార పదార్థాల నాణ్యత పరిశీలన


క్రీడాకారులతో కలిసి భోజనం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

పెరంబూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పరిశీలించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్న ఉదయనిధి, యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో, స్థానిక పెరియమేడులోని నెహ్రూ క్రీడా మైదానంలో ముఖ్యమంత్రి ట్రోఫీ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాస్థాయి క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో, శనివారం ఉదయం స్టేడియానికి వెళ్లిన ఉప ముఖ్యమంత్రి, క్రీడాకారులకు అందిస్తున్న ఆహార పదార్థాలు అడిగి తెలుసుకోవడంతో పాటు క్రీడాకారులతో కలిసి కూర్చుని ఆహార పదార్థాల నాణ్యత పరిశీలించారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి రాష్ట్రానికి పేరు తేవాలని ఈ సందర్భంగా ఉదయనిధి క్రీడాకారులకు పిలుపునిచ్చారు.

కోతకు సిద్ధమైన వరిపంట



పచ్చదనానికి పల్లెలు పుట్టినిల్లు. రాష్ట్రంలోని దక్షిణాది జిల్లాల్లో అందమైన పల్లెసీమలు అధికంగా ఉన్నాయి. వెయ్యేళ్ల క్రితం చోళరాజొకరు మదురై సమీపంలో ఉన్న ఓ పల్లెసీమ అందాలను చూసి మురిసిపోయారు. ప్రకృతి సిద్ధంగా పచ్చదనం, ఎత్తయిన కొండలు, పారే సెలయేళ్లు, పాలకడలిని తలపించే మంచుతెరలు పరచుకున్న కొండలు, కోనలు కలిగిన ఆ అందమైన పల్లెసీమకు జోహార్లు అర్పించారు. ఆ పల్లె పేరే 'చోళవందాన్. నాగమలై, సిరుమలై అనే రెండు కొండల నడుమ ఉందీ ప్రాంతం. పచ్చని పట్టుచీర కట్టుకున్న ప్రకృతిమాత తిష్టవేసుకుందా అనేలా అంతటా అలముకున్న పచ్చదనం మైమరపిస్తుంది.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

SUNDAY SPECIAL


లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న కొబ్బరి కాయలు

పచ్చని పల్లెసీమ... ప్రకృతి ఒడిలో స్వర్గసీమ

- చోళ, పాండ్యరాజులు మెచ్చిన 'చోళవందాన్'
- ముక్కారు పంటలు పండే వ్యవసాయ క్షేత్రం
- నాగలిని ఇష్టదైవంగా ఆరాధించే అన్నదాతలు


వైగై వాగు

ఉదయం నుంచీ సాయంత్రం వరకూ జరిగే చోళవందాన్ పల్లె ముచ్చట్లు అందరినీ మురిపించి, మైమరపిస్తాయి. ఈ పల్లెసీమకు ఆ చోళరాజు ఆగమనాన్ని సూచిస్తూ ఈ ప్రాంతానికి 'చోళవందాన్' (చోళుడు వచ్చాడు) అనే పేరొచ్చింది. ఈ 'చోళవందాన్' అనే తమిళ పదాన్ని చరిత్రకారులు, పురావస్తు పరిశోధకులు విడదీసి... చోళన్ + ఉవందాన్ = చోళవందాన్ అని చెబుతారు. ఈ రెండు పదాల్లో చోళన్ అంటే చోళరాజు అని, ఉవందాన్ అంటే 'సంతోషించాడు' లేదా 'మురిసిపోయాడు' అని అర్థం వస్తుంది కనుక చోళుడు చూసి సంతసించిన ప్రాంతమే 'చోళవందాన్' అని చెబుతున్నారు.


పంట కాల్వలు పొడవునా కోనసీమను తలపించేలా కొబ్బరి చెట్లు

పేరు కోసం చోళ, పాండ్య రాజుల పోటాపోటీ...

దిండుగల్ నుండి మదురై వెళ్లే జాతీయ రహదారిలో ఉన్న ఈ చారిత్రక చోళవందాన్ పల్లెసీమలోకి అడుగుపెడితేనే తనువు పులకరిస్తుంది. చుట్టూ పచ్చదనం, కొండలు, వైగై నదీ వాగు, జలపాతాలు, పంటకాల్వల సవ్వడి శ్రవణానంద భరితంగా ఉంటాయి. నాలుగు రథం వీథులు మాత్రమే కలిగిన ఈ పల్లెసీమ తన పాతకాలం నాటి అందాలను కాపాడుకుంటూ వస్తోంది. పూర్వం రెండు బ్రాహ్మణ అగ్రహారాలు మాత్రమే కలిగిన ఈ పల్లెలో ఆలయాలు, పెంకుటిళ్లు, మిద్దె భవనాల సంఖ్య పెరిగాయి. ప్రస్తుతం అగ్రహాలు అదృశ్యమయ్యాయి. వైగై నదీ తీరంలో ఉన్న ఈ పల్లె ప్రాచీన నామధేయం 'పాగనూర్'. పాగనూర్‌కూట్రమ్ అని కూడా పిలిచేవారని వేళ్లికుడి రాగి శాసనం ద్వారా తెలుస్తోంది. పాండ్యరాజుల కాలంలో ఈ ప్రాంతాన్ని ప్రాంతక వీరనారాయణుడి పేరుతో 'ప్రాంతక చతుర్వేది మంగళం' అనే పేరుతో బ్రహ్మదేయంగా (బ్రాహ్మణుల నివాస ప్రాంతంగా) ఉండేది. ఆ తరువాత పదో శతాబ్దంలో చోళుల సింహస్వప్నం వీరపాండియన్ పేరుతో 'చోళాంతక చతుర్వేది మంగళం' అని పిలిచేవారు. చోళుడికి కాలాంతకుడి (యముడి) వంటి వాడు "చోళాంతకుడు" అంటూ తన పేరుతోనే ఈ ప్రాంతానికి 'చోళాంతక చతుర్వేదిమంగళం' అనే పేరుపెట్టాడు. మొదటి రాజరాజచోళుడు ఈ ప్రాంతాన్ని పరిపాలిస్తున్నప్పుడు ఆ పేరు నచ్చక 'జననాథన్' అంటూ తనకున్న ప్రత్యేక పేరు చేర్చి 'జననాథక చతుర్వేది మంగళం అనే పేరుపెట్టాడు. ఈ ప్రాంతంలో చోళుల పాలన అంతమైన తర్వాత పాండ్యరాజుల పాలనలో ఈ ఊరు పాండ్యుడి పేరుతో 'చోళకులోత్తుంగ చతుర్వేది మంగళం'గా, కాలక్రమేణా మార్పులు చెందుతూ 'చోళవందాన్'గా మారింది.

ఈ ప్రాంతంలోని ఆలయాల్లో క్రీ.శ. 9, 10 శతాబ్దంలో పాండ్యరాజుల కాలం నాటి తమిళ లిపి శిలాశాసనాలున్నాయి. ఇదే విధంగా మొదటి రాజరాజచోళుడు తదితర చోళరాజులు, పాండ్యరాజులు, నాయకరాజుల శిలా శాసనాలు కూడా ఉన్నాయి. ప్రాచీన కాలం నాటి శిలాశాసనాలు కలిగిన జనకై నారాయణ పెరుమాళ్ ఆలయం, పాండ్యరాజుల కాలంలో నిర్మితమై, నాయక రాజుల కాలంలో, ఇటీవల జీర్ణోద్ధరణ, కుంభాభిషేకాలు జరుపుకున్న 'ప్రళయనాథ స్వామి' శివాలయం కూడా ఉంది. ఊరి ప్రజలంతా తమ ఆరాధ్య (కావలి) దైవంగా భావించే జనకై మారియమ్మన్ ఆలయం సహా గ్రామాలయాలు ఎన్నో ఉన్నాయి. ఈ ఊరిలో రాణి మంగమ్మ నిర్మించిన సత్రం కూడా ఉండేది. ఆ సత్రం దుస్థితికి చేరటంతో ఆ స్థలం ద్వారా వచ్చే ఆదాయంతో మదురై రైల్వేస్టేషన్ ఎదురుగా 'మంగమ్మాళ్ సత్రం' నిర్మించడం విశేషం.







మూడు భోగాల పంటలకు నెలవు...

చోళవందాన్‌లో ప్రాచీనతను కాపాడుకుంటూ వస్తున్న నివాసాలు ఎన్నో ఉన్నాయి. నాలుగు రథాల వీథులు కలిగిన ఈ ఊరిలో ఎన్నో ఆలయాలున్నాయి. వీటిలో వాలగురునాథ-అంకాళపరమేశ్వరి ఆలయం, వడకత్తి కాళియమ్మన్ ఆలయం, పొయ్‌గై వినాయకాలయం, స్వర్ణమల్లీశ్వరాలయం, భద్రకాళి ఆలయం, ఉచ్చిమాకాళియమ్మ ఆలయం సుప్రసిద్ధమైనవి. చోళవందాన్ రెండు అగ్రహాలున్న ప్రాంతాలు. మొదటి అగ్రహారం ప్రాంతంలో శ్రీకృష్ణుడి ఆలయం,ఆంజనేయ ఆలయం ఉన్నాయి.ఈ ప్రాంతంలో రాణిమంగమ్మాళ్ నిర్మించిన సత్రం ప్రస్తుతం పాఠశాలగా మారింది.మొదలియార్ కోట,శంగకోట ప్రాంతంలో కోట్టై వాసల్ కాళియమ్మన్ ఆలయం ఉంది. మదురై నాయకరాజు విశ్వనాథనాయకుడి కాలంలో ఆయన వద్ద దళవాయ్‌గా పనిచేసిన అరియనాథ మొదలియార్ కాంచీపురం సమీపం మప్పేడు ప్రాంతం నుండి వందల సంఖ్యలో తన కులస్థులను (మొదలియార్లను) ఈ ప్రాంతానికి తరలించడం వల్లే ఈ ప్రాంతాన్ని మొదలియార్ కోటగా పిలుస్తున్నారు. ఈ ప్రాంతానికి చేరువగానే 'పేట్టై అగ్రహారం' ఉంది. ఇక్కడ శ్రీకృష్ణుడు, వీరకాళియమ్మన్ ఆలయాలున్నాయి. ప్రతియేటా చిత్రాపౌర్ణమి రోజున జనకై నారాయణపెరుమాళ్ చోళవందాన్‌లోని వైగై నదీలోకి దిగి భక్తులను అనుగ్రహిస్తారు. ఈ ప్రాంతంలో ముస్లింలకు ప్రత్యేకమైన దర్గా, క్రైస్తవులకు ప్రార్థనాలయం కూడా ఉన్నాయి. ప్రాచీన కాలం నుండి చోళవందాన్ ముక్కారు పంటలు పండే పల్లెసీమగా పేరొందింది.ఇక్కడ వరి, చెరకు,అరటి పుష్కలంగా పండుతాయి.కొబ్బరి తోటలకు కూడా కొదువలేదు. చోళవందాన్ కొబ్బరి విదేశాలకు కూడా ఎగుమతవుతున్నాయి.ఈ పంటలకు వైగై నదీ జలాలను చేరేవేసే పిల్ల కాలువలలో పారుతున్న నీటి సవ్వడులు విని ఆనందించవచ్చు. పంటల నడుమ ఎద్దులబండ్లు మాత్రమే వెళ్లేందుకు మాత్రమే వీలున్న దారిలో చెంగు చెంగున పరుగులు తీస్తున్న లేగదూడల మెడలో గంటల సవ్వడి వినవచుచ. పోటీలకు సిద్ధం చేస్తూ జల్లికట్టు ఎద్దులతో వెళ్లే యువకులను, వాటి యజమానులను చూడవచ్చు. సాయం సంధ్యా సమయాల్లో ఆ పల్లెలోని ఆలయాల మైక్‌సెట్లలో శ్రవణానందంగా వెలువడే భక్తి గీతాలను వినవచ్చు.

ఈ చోళవందాన్ మేలైన తమలపాకులకు ప్రసిద్ధి చెందింది. కుంభకోణం తమలపాకుల తర్వాత మేలురకం తమలపాకులు చోళవందాన్‌లో సాగు చేస్తున్నారు.. చోళవందాన్ తమలపాకులతో తాంబులం వేసుకున్నవారెంతో మంది ఈ పల్లెసీమ అందాలపై అందమైన కవితలు అల్లారని కూడా చెబుతారు. కనుకనే ఈ పల్లెసీమ అందాలకు చేర, చోళ, పాండ్యరాజులంతా జోహార్లు అర్పించారు. ఈ చోళవందాన్ ప్రజల గుణగుణాలు ఎలా ఉంటాయో తమిళ చిత్రం 'పట్టికాడా పట్టిణమా?' చిత్రం ద్వారా తెలుసుకోవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే చోళవందాన్ వాసులందరికీ ఆత్మగౌరవం అధికం. ఎన్నో తరాలుగా వ్యవసాయమే వీరందరి కులవృత్తి. ఈ రైతులంతా తమ ఇళ్లల్లో నాగళ్ళను ఇష్టదేవతగా పూజిస్తారు. 'కలసి భోజనం చేయడం' చోళవందాన్ వాసులకు ఉన్న ప్రత్యేక గుణం. కులమతాలకు అతీతంగా పంటపొలాల్లో కూలీనాలీ జనంతోపాటు పెత్తందార్లు సైతం చేనుగట్లపైనే కూర్చుని కలిసి భోజనం చేస్తారు. ఇక ప్రతియే చిత్రా (చైత్ర)పౌర్ణమి సందర్భంగా సమైక్యతకు ప్రతీకగా ఊరిలో జనమంతా ఇళ్ళను విడిచి వైగైనదీ తీరాన పండు వెన్నెల కాంతిలో కలిసి భోజనం చేసే ప్రాచీన సంప్రదాయం శతాబ్దాల కాలంగా ఇంకా ఈ పల్లెలో కొనసాగుతుండటం విశేషం. ఇతరుల కష్టాన్ని తమ కష్టంగా భావించి ఆదుకునే గుణం చోళవందాన్ వాసుల్లో అధికమని ఆ ఊరిపై పరిశోధనలు జరిపిన రీడర్లు చెబుతారు. ఈ పల్లెవాసుల కట్టుబొట్లు తమిళ సంస్కృతీ సంప్రదాయాలను ఎలుగెత్తి చాటుతాయని, మొత్తానికి చోళవందాన్ వాసులంతా వెన్నలాంటి మనసున్నవారని ఆ పరిశోధకులు నొక్కివక్కాణిస్తున్నారు. ఇంతటి విశేషాలను సంతరించుకున్న ఈ చోళవందాన్‌లో పర్యటించే స్వదేశీ, విదేశీ పర్యాటకులంతా ఈ ప్రాంతాన్ని 'మదురైలో కేరళ' అని కొనియాడుతుండటం కొసమెరుపు!

రాష్ట్రవ్యాప్తంగా పురటాసి నాలుగో శనివారం పూజలు

● శ్రీవారికి ప్రత్యేక అలంకరణ


టి.నగర్ టీటీడీ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో పద్మావతి తాయారు సమేత శ్రీవారు

ప్యారీస్, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శ్రీనివాస పెరుమాళ్ ఆలయాల్లో పురటాసి నెల నాల్గో శనివారం పూజలు వైభవంగా నిర్వహించగా, భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన వేంకటేశ్వరస్వామికి పురటాసి మాసంలో వచ్చే శనివారాల్లో విశేషపూజలు నిర్వహిస్తుంటారు. స్థానిక టి.నగర్ వెంకట నారాయణ రోడ్డులో ఉన్న టీటీడీ ఆలయంలో పురటాసి నాల్గో శనివారం సందర్భంగా అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, అభిషేకం, అలంకారాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని అరటి, మామిడి తోరణాలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు లడ్డూ ప్రసాదాలు విక్రయించారు. అదే విధంగా టి.నగర్ జీఎన్.చెట్టి రోడ్డులో ఉన్న పద్మావతి తాయారు ఆలయం, ట్రిప్లికేన్‌లో ప్రపంచ ప్రసిద్ధి చెందిన పార్థసారథిస్వామి ఆలయం, తిరువొత్తియూర్ కాలడిపేట పెరుమాళ్ ఆలయం, కాంచీపురం జిల్లా వరదరాజ పెరుమాళ్ ఆలయం సహా రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన తిరుచ్చి, మదురై, తిరునల్వేలి, తూత్తుకుడి సహా పెరుమాళ్ ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. దర్శనం సమయంలో భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి.

వేంకటేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు

ప్యారీస్, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొడుంగైయూర్ సంజయ్‌గాంధీ వీధిలో పురటాసి నెల నాల్గో శనివారం సందర్భంగా శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ షణ్ముగ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో 32వ వార్షిక మహాలక్ష్మి అనుగ్రహ 108 దీపాల పూజను పురస్కరించుకుని ఉదయం 6.30 గంటలకు మహాగణపతి, నవగ్రహ, మహాలక్ష్మి, సుదర్శన హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు శివశక్తి సాయి కళాకారుల శంఖానాదం, 12.30 గంటలకు సహపంక్తి భోజన కార్యక్రమాలను నిర్వహించారు. నిర్వాహకులు షణ్ముగం, ఎం.విజయ్‌కుమార్- సురేఖ దంపతులు, ప్రసాద్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించి ముత్తైదువులకు పసుపుకుంకుమను పంపిణీ చేశారు.

శ్రీవారికి విశేషపూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు



శ్రీవారి సేవలో ప్రముఖులు


రేఖారాణి


హరితేజ

తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ కమిషనర్ రేఖారాణి, సినీనటి హరితేజ, చెన్నై సిటీ కమిషనర్ అరుణ్ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారిసేవలో హైకోర్టు న్యాయమూర్తులు



జస్టిస్ బీ కృష్ణమోహన్ - జస్టిస్ రవి చీమలపాటి

తిరుమల శ్రీవారిని శనివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో జస్టిస్ బీ కృష్ణమోహన్, జస్టిస్ రవి చీమలపాటి దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వీరికి వేదపండితులు ఆశీర్వచనం చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.86 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,468

తలనీలాలు సమర్పించినవారు: 26,878




పిల్లలకు పిజ్జా తినిపిస్తూ..

చౌడేపల్లెకు చెందిన రెడ్డెప్ప పుట్టుకతో అంధుడు. తిరుచానూరులోని నవజీవన్ బ్లైండ్ స్కూల్లో పాటలు పాడటంలో నేర్పరి. ప్రేరణ సేవా సంస్థ ప్రోత్సాహంతో ఇప్పుడు హైదరాబాద్‌లోని ఎంఎన్‌ఆర్ పాఠశాల అండ్ కళాశాలలో సంగీత ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు.

తిరుపతి బైరాగిపట్టెడలోని మాతృశ్రీ చైల్డ్‌హోమ్ పిల్లలకు సముద్రం చూడాలనే కోరిక కలిగింది. వారి కోరికను తీర్చేందుకు 'ప్రేరణ' ముందుకువచ్చింది. ఆనందసాగరంలో ముంచెత్తి వారితో సంతోషాన్ని పంచుకుంది.

శ్రీవెంకటేశ్వర డెఫ్ అండ్ డమ్ పాఠశాల విద్యార్థులకు 'ప్రేరణ' అందించిన శిక్షణ జీవితాల్లో వెలుగులు నింపింది.


సముద్రంలో జలకాలాడుతూ మాతృశ్రీ చైల్డ్‌హోమ్ పిల్లల ఆనందం



ఎస్వీడీడీ పాఠశాల విద్యార్థుల నృత్యం


ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లలను ఆడిస్తున్న ప్రేరణ సభ్యులు


వృద్ధాశ్రమంలో వృద్ధులతో మాటామంతి

నేనున్నానని...



ఆశ్రమంలో నిత్యావసరాలను అందిస్తూ..

అసహాయులకు బాసటగా 'ప్రేరణ' సేవాసంస్థ

18ఏళ్ల మానవతా ప్రస్థానంలో ఎందరికో చేదోడువాదోడు

ఆంధ్రజ్యోతి - తిరుపతి(కల్చరల్)

అసహాయులకు తోడుగా నిలుస్తోంది. ఆనందాన్ని పంచుతోంది. వారిలోని ప్రతిభకు పట్టం కడుతోంది. సేవకు ప్రతిరూపమై ప్రత్యేక ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యం నింపుతోంది ప్రేరణ సేవా సంస్థ. ముగ్గురు విద్యార్థుల ఆలోచన ఫలితమే ఈ మానవతా సంస్థ ఆవిర్భావానికి బీజం వేసింది. తిరుపతిలోని శ్రీవిద్యానికేతన్‌లో బీఎస్సీ బయో టెక్నాలజీ చదువుతుండగా రాజశేఖర్, భార్గవి, విద్యాశ్రీలకు ఎదురైన అనుభవాలూ ఈ సంస్థ ఏర్పాటుకు కారణమైంది. రోడ్డుపై భిక్షాటన చేస్తున్న బాలల్ని ఈ విద్యార్థులు చూశారు. చదువుకోవాల్సిన చిన్నారులు దారి తప్పిన తీరు తెలుసుకుని చలించిపోయారు. చదువుపై ఆసక్తి చూపిన వారికి పుస్తకాలు కొనిచ్చారు. కొంతమంది స్వార్థంతో ఇలాంటి పిల్లలు చెడు దారి పడుతున్నారని గుర్తించారు. బాధిత పిల్లలను చేరదీసి ఆశ్రమంలో చేర్పించారు. ఈ సంఘటనలు ఆ ముగ్గురు విద్యార్థులనూ సేవాపథం వైపు నడిపించాయి. 2008లో తమ కళాశాల అధ్యాపకులు శ్రీలత, రవీంద్రల ప్రోత్సాహంతో వీరు ప్రేరణ పేరిట హెల్పింగ్ సొసైటీని ఏర్పాటు చేశారు. తొలి రోజుల్లో సహచరుల సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహించేవారు. ఏడాదిలోపు 43 మంది సభ్యులకు సంస్థ చేరింది. ఇప్పుడు సుమారు 300లకు పైగా సభ్యులతో బలమైన వృక్షంగా మారింది. ఈ సంస్థలో సభ్యులంతా విద్యార్థులే. వివిధ కళాశాలల్లో చదుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే సంకల్పం ఉన్నవారే.

ఎక్కడ ఉన్నా వీడని బంధం..

ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ఆరంభంలో ఉన్న విద్యార్థులు ఇప్పుడు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అయినా ప్రేరణతో బంధం వీడలేదు. వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తూనే తమ జూనియర్స్‌ను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహిస్తున్నారు. తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. వీరిలో రాజశేఖర్ తిరుపతి ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు మేనేజరుగా పనిచేస్తున్నారు. భార్గవి చెన్నైలో, దిగ్విజయ్ బెంగళూరులో పనిచేస్తున్నారు. ఇలా పలువురు ప్రేరణ సభ్యులు ఉద్యోగాలూ చేస్తూ వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నా వార్షికోత్సవం వచ్చిందంటే రెక్కలు కట్టుకుని తిరుపతిలో వాలిపోతున్నారు. ప్రత్యేక ప్రతిభావంతుల నృత్య, సంగీత కార్యక్రమాలు నిర్వహించి వారితో సంతోషాలను పంచుకుంటున్నారు.

ఓ విద్యార్థిని కోసం వార్షికోత్సవం..

తొలి ఏడాది సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు నవజీవన్ బ్లైండ్ స్కూల్‌ను సందర్శించారు. ఆ సమయంలో రోజా అనే విద్యార్థిని బాధపడుతూ కనిపించింది. జ్వరం జలుబు, దగ్గు కారణంగా పోటీల్లో బాగా పాడలేకపోయానని రోదించింది. ప్రేరణ సభ్యుల్లో ఒకరైన భార్గవి ఆ అమ్మాయిని దగ్గరకు తీసుకుంది. మంచి వేదికపై పాటపాడే అవకాశం కల్పిస్తామని మాటిచ్చింది. దాంతో ఆ విద్యార్థిని పట్టలేని ఆనందంతో గంతేసింది. ఆ అమ్మాయికి ఇచ్చిన హామీ నెరవేర్చాలనే క్రమంలో పుట్టుకొచ్చిందే తొలి వార్షికోత్సవ నిర్ణయం. వార్షికోత్సవం నిర్వహించేందుకు ఆర్థికంగా స్థోమత లేకున్నా ధైర్యంగా ముందడుగు వేశారు. తమ తరగతితో పాటు ఇతర తరగతులు.. వివిధ విద్యాసంస్థల్లో విరాళాలు సేకరించారు. మొత్తం మీద తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో తొలి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేదికపై రోజా కమ్మని గీతంతో అందరి హృదయాలను దోచుకుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాటి టీటీడీ ఈవో కేవీ రమణాచారి ప్రేరణ సేవలను అభినందించారు. మహతిలో ఎప్పుడు కార్యక్రమం నిర్వహించాలన్నా ఉచితంగా అవకాశం కల్పిస్తూ నిర్ణయాన్ని ప్రకటించారు. 2008లో తొలి ఏడాది వార్షికోత్సవంలో అందిన ప్రోత్సాహంతో 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంది 'ప్రేరణ' సేవా సంస్థ.


రెడ్డెప్ప



ప్రేరణ సభ్యులు

ముురికి కాలువలో పసికందు




తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఆ తల్లికి ఏమి కష్టం వచ్చిందో ఏమో ఇంకా కళ్లు కూడా తెరవని పసికందును మురికి కాలువలో పడేసింది. తిరుపతి సింగాలగుంటలోని మసీదు వీధిలో కాలువలో పడి ఉన్న ఆ పసికందు శవాన్ని అక్కడ పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది గుర్తించారు. స్థానిక వీఆర్వోకు సమాచారం అందించారు. వీఆర్వో అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ అజిత అక్కడికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

రేపు ఇంటర్ విద్యార్థులకు జాబ్‌మేళా

- ఉన్నత విద్యకూ అవకాశం

తిరుపతి(విద్య), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. టెక్‌బీ ప్రోగ్రాంతోపాటు కంపెనీ ఆర్థిక సాయంతో ఉన్నత చదువులు చదివే అవకాశం కూడా కల్పించనున్నారన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు పెద్దగా ఉద్యోగావకాశాలు ఉండని క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇంటర్ విద్యామండలి హెచ్‌సీఎల్ ద్వారా ఈ మేళాను ఏర్పాటు చేసిందన్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతోపాటు ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్, ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 2024, 2025 సంవత్సరాల్లో కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులైనవారు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. టెక్‌బీ ప్రోగ్రాంకు ఎంపికైన వారికి సంవత్సరంపాటు శిక్షణ ఉంటుంది. ఇంటర్న్‌షిప్ సమయంలో అభ్యర్థికి నెలకు రూ.10వేల చొప్పున స్టైఫండ్ ఇస్తారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి నెలకు రూ.2.20 లక్షల జీతంతో ఉద్యోగం లభిస్తుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు **https://bit.ly/TechbeeGoAP** లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకోనివారు 13వ తేదీన ఎంపికల సమయంలో కంపెనీ ప్రతినిధులతో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. ఇతర వివరాలకు హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతినిధి ఎస్.రాజ్‌కుమార్‌ను 7780323850లో సంప్రదించవచ్చునని వివరించారు.

తిరుమలలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తిరుమల, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. 50 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో వెంగమాంబ అన్నప్రసాద భవనం వెలుపల గేటు వద్ద అచేతనంగా పడి ఉండటాన్ని భద్రతా సిబ్బంది గుర్తించారు. అశ్విని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు 94407 96769కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

ముక్కంటి ఆలయంలో 22నుంచి కార్తీక మాస పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 22వ తేదీ నుంచి నవంబరు 20వ తేదీ వరకు కార్తీకమాస పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి తెలిపారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయం తెరచు వేళలు, సోమవారం రోజున ప్రాతఃకాల అభిషేకాలు, పవళింపు సేవల సమయాలలో మార్పులు చేసినట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. మోహనమంత్ర




ఉర్రూతలూగిస్తున్న డీజే - పాల్గొన్న విద్యార్థులు - కేరళ వాయిద్యాలను తిలకిస్తున్న మోహన్‌బాబు

చంద్రగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.రంగంపేట మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో మోహనమంత్ర కార్యక్రమం రెండవ రోజు శనివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. హర్రర్ హౌస్, కళాక్షేత్ర, రాంప్‌వాక్,ఫొటోషూట్, గల్లీ క్రికెట్, రింగ్ టాస్, బ్రేక్ డ్యాన్స్, డ్రాగన్ ట్రెయిన్, ట్రెజర్ హంట్ తదితర కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. సాయంత్రం డీజే పరీమా (ముంబై) ప్రొ షో విద్యార్థులను ఉర్రూతలూగించింది. ఈ సందర్భంగా ఎంబీయూ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నాగరాజరామారావు మాట్లాడుతూ నిర్వహించిన వర్క్‌షాపులు విద్యార్థుల మేధోసంపత్తికి దోహదపడ్డాయన్నారు. కాగా కళావేదికపై విద్యార్థులు నిర్వహించిన నృత్య గాన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. టెక్నికల్ విభాగంలో రోబోవార్స్ కార్యక్రమంలో వీసీ నాగరాజరామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు సందడి చేశారు. ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ మోహన్‌బాబు పాల్గొని ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, చీఫ్ గ్రోత్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

రేణిగుంట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గువ్వలకాలనీలో శ్రీహరి హత్య కేసులో నిందితుడు ఎస్.మేస్త్రీ(33)ని పోలీసులు అరెస్టు చేశారు. రేణిగుంట రూరల్ సీఐ ఎం.మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు.. మేస్త్రీ భార్య భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లి పోయింది. ఈ క్రమంలో శ్రీహరి మేస్త్రీని హేళనగా మాట్లాడాడు. దీనిపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. శుక్రవారం టిఫిన్ సెంటర్ వద్ద మరోసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో మేస్త్రీ తన జేబులో నుంచి కత్తిని తీసి శ్రీహరి మెడపై పొడవంతో అతడు తీవ్ర గాయాలపాలయ్యాడు. శ్రీహరి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.


నిందితుడు మేస్త్రీని అరెస్టు చేసిన పోలీసులు

21 ఎర్రచందనం దుంగల స్వాధీనం



మంగళం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం గొల్లపల్లి బీట్ పరిధిలో శనివారం తిరుపతి అటవీ శాఖ అధికారులు కూంబింగ్ నిర్వహించి పొదల్లో దాచి ఉంచిన 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రేంజ్ అటవీశాఖ అధికారి సుదర్శన్‌రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు శుక్రవారం అర్ధరాత్రి వడమాలపేట మండలం పాదిరేడు సెక్షన్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా గొల్లపల్లి వద్ద పొదల్లో దాచి ఉంచిన ఎర్రచందనం దుంగలు అధికారుల కంటపడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కూంబింగ్‌లో సెక్షన్ ఆఫీసర్ శంకరప్ప, బీట్ ఆఫీసర్లు మునినాయక్, జ్యోతి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితుల నియామకం

శ్రీకాళహస్తి, అక్టోంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డులో ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితుల పేర్లతో అధికారులు శనివారం అధికారిక జీవోను విడుదల చేశారు. చాగణం శైలజ, మొక్కపాటి వెంకటరమణనాయుడికి అవకాశం కల్పించారు.

పంట పొలాలపై 'గజ'దాడులు

చంద్రగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని యల్లంపల్లె గ్రామ అటవీ ప్రాంత సమీప పంట పొలాలపై శుక్రవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. సాయంత్రం 6 గంటలకు ఏనుగుల గుంపు పులిచెర్ల అడవుల్లో నుంచి యల్లంపల్లె అటవీ ప్రాంతంలోకి చొరబడ్డాయి. రాత్రి 9 గంటల సమయంలో 8 ఏనుగులు పంట పొలాలపై దాడులు చేస్తుండటంతో గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారులు, గ్రామస్తులు కలిసి ఏనుగులు గ్రామంలోకి రాకుండా బాణసంచా పేల్చుతూ, డప్పులు వాయించారు. జ్ఞానప్రకాష్‌రెడ్డికి చెందిన వరి పైరును పూర్తిగా ధ్వంసం చేశాయి. పక్క పొలంలో ఇరిగేషన్ పైపులను ధ్వంసం చేశాయి. శనివారం వేకువజాము వరకు అవి ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోనే తిరుగుతుండటంతో యల్లంపల్లె గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు ఇటువైపు రాకుండా అడ్డుకోవడానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.


ఏనుగుల దాడిలో ధ్వంసమైన ఇరిగేషన్ పైపులైన్

ఆకట్టుకున్న శోభారాజ్ గాత్రకచేరి



శ్రీవారి సహస్రదీపాలంకార సేవలో ప్రముఖ గాయని శోభారాజ్ గాత్ర కచేరి భక్తులను ఆకట్టుకుంది. శనివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామికి జరిగిన సహస్రదీపాలంకార సేవలో ఆమె పాల్గొన్నారు. శిష్య బృందంతో కలిసి శ్రీవారికి సంకీర్తనా కైంకర్యం చేశారు. తొలుత 'అన్నమయ్య గాయత్రి' మంత్రంతో ప్రారంభించి 'హరియవతారమీతడు అన్నమయ్య', 'ఈరూపమై ఉన్నాడు ఇతడే పరబ్రహ్మము' అను కీర్తలను రసరమ్యభరితంగా ఆలపించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కల్యాణ వెంకన్నకు అభిషేక సింహాసనం కానుక


అభిషేక సింహాసనాన్ని అందజేస్తున్న దాతలు

చంద్రగిరి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు శనివారం అభిషేక సింహాసనం బహూకరించారు. బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీకి చెందిన మదన్‌మోహన్‌రెడ్డి, యువజ్యోతిలు సుమారు రూ.9 లక్షల విలువ గల బంగారు పూత కలిగిన రాగి అభిషేక సింహాసనాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్చకులు నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ అక్రమాలకు పాల్పడిన 16 మందిపై కేసు

సత్యవేడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం వానెల్లూరు రెవెన్యూలో చోటు చేసుకున్న భూ మాయాజాలంపై కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు భూ అక్రమాలకు పాల్పడిన 16 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ మురళి తెలిపారు. సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది అక్రమార్కులతో కుమ్మక్కై వానెల్లూరు రెవెన్యూ పరిధిలో సుమారు 300 ఎకరాలకు నకిలీ పట్టాలు సృష్టించారు. ఈ భూ కుంభకోణంపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 8వ తేదీన 'రెవెన్యూలో మాయాజాలం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులు, సిబ్బంది, అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జేసీకి ఆదేశించారు. దీంతో తహసీల్దార్ రాజశేఖర్ సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు సీఐ మురళి కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో బాగంగా అప్పటి తహసీల్దార్ రామాంజనేయులు, ఆర్ఐ సురేష్, వీఆర్వోలు రాఘవేంద్ర, భార్గవ్ అతని భార్య తేజశ్వి, విలేజ్ సర్వేయర్ వెంకటేష్, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, సచివాలయ సిబ్బంది పూర్ణచంద్రతోపాటు పట్టాలు పొందిన పీ.శ్రీధరన్, అమృతవర్షిణి, నవీన్ రాజ్‌ఖన్నా, అనురాధ జయకుమార్, లతజయ్‌కుమార్, ఆశాసురేష్ పట్టాల సృష్టికి ఆధార్ కార్డులు సమర్పించిన మల్లీశ్వరి, బత్తెమ్మ పేర్ల మీద ఐపీసీ 120ఏబీ, 420, 466, 467 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

తిరుపతి-అనకాపల్లి మధ్య 2 నుంచి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నెలకొన్న ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు తిరుపతిలో ప్రతి ఆదివారం, అనకాపల్లిలో ప్రతి సోమవారమూ రైళ్ల రాకపోకలు సాగిస్తాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు (07481) ఆదివారం బయలుదేరి అనకాపల్లికి మరుసటి రోజు(సోమవారం) చేరుకుంటుంది. అదేరోజు ఈ ప్రత్యేక రైలు (07482) అనకాపల్లిలో బయలుదేరి మరుసటి రోజు తిరుపతికి చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.